## విద్యార్థులకు వైద్య పరీక్షలు

కొత్తపల్లి, జనవరి 24: మల్కాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్‌బీకేఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని వైద్యాధికారి సాజిద ప్రారంభించారు. శిబిరంలో విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు, వైద్యులు హబీబుద్దీన్ ఫర్మన్, శ్రీలత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పరామర్శ

చొప్పదండి, జనవరి 24: మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ భర్త గాలన్న ఇటీవల మృతి చెందారు. కాగా, సైదాపూర్ మండలం వెంకటేశ్వర్లపల్లిలో బుధవారం బొడిగ శోభను చొప్పదండి మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి, మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు నలుమాచు రామకృష్ణ, సీపెల్లి గంగయ్య పరామర్శించారు.



మాజీ మంత్రి కేటీఆర్‌కు మొక్క ఇచ్చి స్వాగతం పలుకుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

సీడీని ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



కరీంనగర్‌లోని రాజశ్రీ గార్డెన్‌లో బుధవారం పార్లమెంట్ స్థాయి సోషల్ వారియర్స్ సమావేశం నిర్వహించారు. కాగా, ముఖ్యఅతిథిగా హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మొక్క అందజేసి ఘన స్వాగతం పలికారు. అలాగే, వినోద్‌కుమార్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన సీడీని కేటీఆర్ ఆవిష్కరించారు. *-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్*

# టెన్షన్.. టెన్షన్

- నేడే జమ్మికుంట మున్సిపల్ అ'విశ్వాస' పరీక్ష
- ప్రత్యేకాధికారిగా కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ నియామకం
- 2/3 మెజార్టీ లెక్కన 21 మంది మద్దతు దక్కితేనే నెగ్గనున్న బలపరీక్ష..?
- సర్వత్రా ఉత్కంఠ

**జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావుపై సభ్యులు పెట్టిన అ'విశ్వాస' తీర్మాన పరీక్షకు సమయం ఆసన్నమైంది. నేడు ఉదయం 10గంటలకు 30 మంది కౌన్సిలర్లు హాజరుకావాల్సి ఉండగా, 2/3 మెజార్టీ లెక్కన 21 మంది మద్దతు దక్కుతుందా..? లేదా అన్నది సస్పెన్స్‌గా మారింది. అవిశ్వాస పరీక్షకు ప్రత్యేకాధికారిగా కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్‌ను కలెక్టర్ నియమించగా, గత 26 రోజుల క్యాంపు రాజకీయాలకు నేటితో తెరపడుతుందా..? కొనసాగుతుందా..? అనే టెన్షన్ అన్ని వర్గాల్లోనూ నెలకొంది.**

*- జమ్మికుంట, జనవరి 24*



విప్ కాపీలను కలెక్టర్‌కు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

### కౌన్సిలర్లకు విప్ జారీ

జమ్మికుంట మున్సిపల్‌కు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని పార్టీ విప్‌గా నియమిస్తూ బీఆర్ఎస్ ప్రెసిడెంట్ కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో ఆయన బీఆర్ఎస్ కౌన్సిలర్లు 22 మందికి విప్ జారీ చేశారు. విప్ కాపీలను కలెక్టర్‌కు ఎమ్మెల్యే అందజేశారు. బీఆర్ఎస్ తరపున మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన కౌన్సిలర్లు పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేస్తే వారి కౌన్సిల్ సభ్యత్వం రద్దు చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

జమ్మికుంట మున్సిపల్‌లో 30 వార్డులున్నాయి. 2020 జనవరిలో ఎన్నికలు కాగా, 22 మంది సభ్యులు బీఆర్ఎస్ నుంచి గెలిచారు. కాంగ్రెస్, ఇండిపెండెంట్‌గా గెలిచిన ఏడుగురు కౌన్సిలర్లు బీఆర్ఎస్‌లో చేరగా, పార్టీ సభ్యుల సంఖ్య 29కి చేరింది. చైర్మన్ రాజేశ్వర్‌రావు, వైస్ చైర్‌పర్సన్‌గా దేశిని స్వప్న, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. బాధ్యతలు స్వీకరించారు. ఒక్క 24వ వార్డు సభ్యురాలు సాయిని రమ మాత్రమే కాంగ్రెస్‌లో ఉండిపోయారు. అయితే కొద్ది కాలంగా చైర్మన్, సభ్యుల మధ్య విబేధాలు తారాస్థాయికి చేరాయి. ఇదే క్రమంలో ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలవగా.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అయితే ఎన్నికల సమయంలో 23వ వార్డు కౌన్సిలర్ మల్లయ్య కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పెద్దల సహకారంతో అసమ్మతి కౌన్సిలర్లతో జతకట్టారు. గత డిసెంబర్ 29న 20 మంది కౌన్సిలర్ల సంతకాలతో చైర్మన్‌పై అవిశ్వాసం కోసం డీఆర్వోకు నోటీసులు అందజేశారు. 24గంటలు గడువక ముందే మెజార్టీ సభ్యుల మద్దతు తమకే ఉందంటూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో చైర్మన్, వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు సంతకాలతో కూడిన నోటీసులు కలెక్టర్‌కు అందించారు. దీంతో రాజకీయం వేడెక్కింది. ఇరు వర్గాలు క్యాంపునకు తరలివెళ్లాయి. క్యాంపుల్లో సభ్యుల కోసం ఇరు వర్గాలు బాహాబాహీకి దిగాయి. పరిస్థితి కేసుల నమోదు వరకు వెళ్లింది. ఇదే సమయంలో జనవరి 25న అవిశ్వాస పరీక్ష ఉంటుందని, సభ్యులందరికీ కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. దీంతో గత 26 రోజులుగా సభ్యులంతా క్యాంపులకే పరిమితమయ్యారు.

**నేటితో తెరపడేనా..?**

చైర్మన్ రాజేశ్వర్‌రావుకు 14 మంది కౌన్సిలర్లు, ఎక్స్ అఫిషియో సభ్యుడి హోదాలో ఎమ్మెల్యేతో కలిపి 15 మంది మద్దతు ఉండగా, మల్లయ్య వర్గంలోని క్యాంపులో 16 మంది కౌన్సిలర్లు ఉన్నట్లు సమాచారం. అవిశ్వాస నోటీసు సమయంలో మల్లయ్య 20 మంది సంతకాలతో కూడిన పత్రాన్ని అందించినట్లు తెలుస్తున్నది. అయితే అవిశ్వాసానికి 2/3 సభ్యుల సంతకాలు తప్పనిసరని తెలిసింది. దీన్ని మల్లయ్య వర్గం ఇక్కడి వరకు బాగానే వర్కవుట్ చేసింది. 2/3 లెక్క సరిపోయింది. ఇక బల పరీక్షకు 30 మంది సభ్యుల్లో 16మంది ఉంటే 'పరీక్ష' నెగ్గుతుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి కూడా. అయితే ఇక్కడే మరో ట్విస్ట్ వచ్చి పడింది. అవిశ్వాసం సాఫీగా సాగుతుందని భావించిన మల్లయ్య వర్గానికి ఎమ్మెల్యే షాక్‌నిచ్చారు. ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఓటు నమోదు చేసుకున్నారు. ఇటీవల పొందారు కూడా. ఇక దీంతో చైర్మన్ వర్గానికి 15 మంది సభ్యుల మద్దతు లభించినట్లైంది. ఇదే జరిగితే 21 మంది సభ్యుల సంతకాలతో కూడిన మద్దతుంటేనే అవిశ్వాసం నెగ్గుతుందని అంటున్నారు. అవిశ్వాసానికి నోటీసులిచ్చిన సమయంలో 21 మంది సభ్యుల సంతకాలు కావాలా..? 20 మంది సభ్యుల సంతకాలు సరిపోతాయా..? అవిశ్వాస నోటీసు తర్వాత ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఓటు హక్కును పొందిన ఎమ్మెల్యేను పరిగణనలోకి తీసుకుంటారా..? తీసుకోరా..? ఇరు వర్గాలు మున్సిపల్ యాక్ట్‌ను ఫాలో అవుతున్నాయా..? లేదా..? తెలియకున్నది. ఇదిలా ఉంటే.. నేటి 'పరీక్ష'కు రెండు వర్గాలు హాజరవుతాయా..? పరీక్ష వాయిదా పడుతుందా..? ఒకవేళ పరీక్ష జరిగితే.. సభ్యులు చైర్మన్‌పై విశ్వాసం ప్రకటిస్తారా..? అవిశ్వాసానికే మొగ్గు చూపుతారా..? వేచి చూడాల్సిందే. ఏదేమైనా చైర్మన్ గిరి కోసం ఇరు వర్గాలు పోటాపోటీగా తలపడుతున్నాయి. ఉత్కంఠ వీడేందుకు కొన్ని గంటలు ఓపిక పట్టాల్సిందే.

## భూఆక్రమణ కేసులో కార్పొరేటర్ అరెస్ట్

రాంనగర్, జనవరి 24: భూఆక్రమణ కేసులో కరీంనగర్ కార్పొరేటర్ జంగిలి సాగర్‌ను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని సీతారాంపూర్‌కు చెందిన లింగారెడ్డి అనే ఉపాధ్యాయుడికి పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమి విషయంలో తనకు రూ.40 లక్షలు ఇవ్వాలని లేకుంటే 4 గుంటల స్థలం తన పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని కార్పొరేటర్ జంగిలి సాగర్ డిమాండ్ చేశారు. అంత మొత్తం ఇచ్చుకోలేనని చెప్పినా పట్టించుకోకుండా లింగారెడ్డి భూమిలో నుంచి రోడ్డు వేయించాడు. రోడ్డు ఎందుకు వేశావని ప్రశ్నించగా బెదిరింపులకు గురి చేసి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయగా తన కూతురు అకౌంట్‌కు కొంత డబ్బులు బదిలీ చేశారు. అయినా వేధింపులు ఆపకపోవడంతో ఈనెల 18న సీపీ అభిషేక్ మహంతిని లింగారెడ్డి కలిసి ఫిర్యాదు చేయగా, విచారణ జరుపాలని ఏసీపీని ఆదేశించారు. ఈ క్రమంలో అజ్ఞాతంలోకి వెళ్లిన కార్పొరేటర్ జంగిలి సాగర్‌ను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించగా, జిల్లా జైలుకు తరలించారు.

## పిల్లలను చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలి

కలెక్టరేట్, జనవరి 24: సంతానం లేని దంపతులు పిల్లలను చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. నగరంలోని శిశుగృహలో ఉన్న నాలుగు నెలల బాబును మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా దత్తత తీసుకున్న తల్లిదండ్రులకు బుధవారం దత్తత పత్రాలు అందజేశారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చట్టప్రకారం దత్తత తీసుకుంటే భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో ఎం సరస్వతి, బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ధనలక్ష్మి, 1098 కో-ఆర్డినేటర్ సంపత్, సీడీపీవో కస్తూరి, శిశుగృహ మేనేజర్ తేజస్విని, రాజేశ్, రమేశ్ పాల్గొన్నారు.

**ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించాలి**

జిల్లాలో 14వ జాతీయ ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి ప్రకటనలో అధికారులకు సూచించారు. బూత్‌స్థాయిలో ఓటరు ప్రతిజ్ఞ చేపట్టాలని పేర్కొన్నారు.

## నూతన కార్యవర్గం

గంగాధర, జనవరి 24: మండలంలోని ప్రభుత్వామోదిత పాఠశాలల యాజమాన్య సంఘం కార్యవర్గాన్ని బుధవారం గంగాధరలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మిట్టపల్లి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా మల్లయ్య, కోశాధికారిగా నర్సయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కోరెం సంజీవరెడ్డి, గౌరవాధ్యక్షుడు పర్రెం లక్ష్మారెడ్డి, సభ్యులు వీరేశం, రాజేశం పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

గంగాధర/కరీంనగర్ రూరల్, జనవరి 24: గంగాధర మండలం మధురానగర్, గంగాధర, గర్శకుర్తి, కరీంనగర్ రూరల్ మండలం నగునూర్, మొగ్దుంపూర్, చెర్లభూత్కూర్ గ్రామాల్లోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తహసీల్దార్ రమేశ్ బాబు, ఏవోలు రాజు, సత్యం బుధవారం తనిఖీలు చేశారు. దుకాణాల లైసెన్స్, స్టాక్ రిజిష్టర్లు పరిశీలించారు. ఎరువులు కొన్న రైతులకు రసీదు ఇవ్వాలని సూచించారు.

## ముగిసిన కస్టడీ

రాంనగర్, జనవరి 24: భూఆక్రమణ కేసులో జైల్లో ఉన్న కార్పొరేటర్ తోట రాములు, చీటీ రామారావును ఒక రోజు కస్టడీ కోసం కోర్టు అనుమతితో పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో గంగాధరలోని చీటి రామారావు ఇంటితో పాటు కరీంనగర్‌లోని భగత్‌నగర్‌లో గల తోట రాములు ఇంట్లో పోలీసులు తనిఖీలు చేపట్టి పలు కీలక డాక్యుమెంట్లను సీజ్ చేశారు.

## నైపుణ్యాలతో కూడిన విద్యనభ్యసించాలి

కమాన్‌చౌరస్తా, జనవరి 24: ప్రతి విద్యార్థి నైపుణ్యాలతో కూడిన విద్యనభ్యసించాలని ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ మల్లేశ్ సూచించారు. ఎస్‌యూలో ఎంబీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ కార్యక్రమం నిర్వహించగా, ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్‌బీ ఏజీఎం సత్యనారాయణ, పరీక్షల నియంత్రణాధికారి శ్రీరంగ ప్రసాద్, ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మనోహర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

**CHANGE OF NAME**

★ I, RAKAM DAMODER, S/o. Rakam Narasaiah, R/o. 9-7-252, Vittal Nagar, Post, Godavarikhani, Ramagundam, Peddapalli-505 214, TS. Changed My Name as "RAKAM DAMODAR".
NT-319344

★ I, DEVARAKONDA BHARATH, S/o. Devarakonda Vijay Kumar, R/o. 21-2-87/10, Markandeya Colony, Godavarikhani, Ramagundam, Peddapalli-505 209, TS. Changed My Name as "DEVARAKONDA BHARATH KUMAR".
NT-319344

★ I, ANNAJI SWAPNA, W/o. Seepelly Omkara Swamy, R/o. 7-1-9/3/1, G.M. Colony, Godavarikhani, Ramagundam, Peddapalli-505 209. After Marriage, I Changed My Name as "SEEPELLY PADMA".
NT-319344

★ I, ENUGULA ANIL KUMAR, S/o. Malla Reddy, R/o. 1-51, Banjarupalli, Dharmaram, Peddapalli, T.S. Changed My Name as ENUGU ANJI REDDY S/o. Malla Reddy.
NT-319346

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.




## భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తా

చొప్పదండి, జనవరి 24: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలకు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హామీ ఇచ్చారు. కరీంనగర్‌లోని నివాసంలో పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను పేరెంట్స్ కమిటీ సభ్యులు, గురుకుల కళాశాల వైస్ ప్రిన్సిపాల్ దీప్తి, సిబ్బంది శ్రావణి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ సంబోజి శేఖర్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, కోశాధికారి శంకర్, సభ్యులు లంక అజయ్ కుమార్, కొత్తూరు సుధాకర్, ఆరెల్లి సదానందం పాల్గొన్నారు.

## పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్

సైదాపూర్, జనవరి 24: పీఆర్‌టీయూ తెలంగాణ మండల ప్రధాన కార్యదర్శిగా పల్లెర్ల శ్రీనివాస్‌ను జిల్లా గౌరవాధ్యక్షుడు పాతూరి రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి అట్ల శ్రీనివాస్‌రెడ్డి నియమించారు. ఈ సందర్భంగా పల్లెర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

## అడ్తిదారుల సంఘం నూతన కార్యవర్గానికి సన్మానం

జమ్మికుంట, జనవరి 24: జమ్మికుంట అడ్తిదారుల నూతన కార్యవర్గ సభ్యులను బుధవారం అడ్తిదారుల సంఘ భవనంలో ఖరీదుదారులు, తదితరులు ఘనంగా సన్మానించారు. మార్కెట్ సాఫీగా సాగేలా సమన్వయంతో ముందుకు సాగుదామన్నారు. కార్యక్రమంలో సన్మాన గ్రహీతలు అడ్తిదారుల సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, గౌరవాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కుమారస్వామి, కోశాధికారి సత్యనారాయణ, వ్యాపారులు భాస్కర్, శివకుమార్, నారాయణ, రవీందర్, బాబన్న, శ్యాం, అడ్తిదారుల సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్యలో ఫ్రెషర్స్ హంగామా

తిమ్మాపూర్, జనవరి 24: ఎల్ఎండీ కాలనీలో గల శ్రీ చైతన్య ఫార్మసీ కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు.. బుధవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు అపూర్వ స్వాగతం పలికారు. ఆటపాటలతో హంగామా చేశారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ, ఫార్మసీ, డ్రగ్స్ రంగాలకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, విద్యార్థులు ఎప్పటికప్పుడు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రామనర్సింహారెడ్డి, ప్రొఫెసర్ డాక్టర్ అప్పారావు, హెచ్‌వోడీ డాక్టర్ రవీందర్‌రెడ్డి, అధ్యాపకులు ధనుంజయ్, రాంప్రసాద్, లైబ్రేరియన్ రమేశ్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

వీణవంక/ కమాన్‌చౌరస్తా, జనవరి 24: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నాటికల ద్వారా బాలికల గొప్పదనాన్ని వివరించారు. వివిధ అంశాల్లో పోటీల్లో నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి లావణ్య, పాఠశాల సిబ్బంది, పాల్గొన్నారు. నగరంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన బాలికా దినోత్సవంలో ప్రిన్సిపాల్ మౌనిక, ఇంపాక్ట్ డైరెక్టర్ కుతాడి తిరుపతి, కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## సామిల్ సందర్శన

మానకొండూర్, జనవరి 24: మండల కేంద్రంలోని ఓం గణేశ్ సామిల్‌లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో మూడు లక్షల విలువైన కలప కాలిపోయింది. కాగా, బుధవారం విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం జిల్లా నాయకులు సామిల్‌ను సందర్శించారు. యజమాని శ్రీనివాస్‌ను ప్రమాదం వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంఘం నాయకులు రంగు భాస్కరాచారి, మియ్యాపురం లక్ష్మణాచారి, ముత్తోజు ప్రభాకర్, బ్రహ్మాచారి, బలరాం పాల్గొన్నారు.

## కేక్ కట్ చేసి.. అభిమానం చాటి

శంకరపట్నం, జనవరి 24: మండల కేంద్రంలో జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా బుధవారం బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో హుజూరాబాద్ ఏఎంసీ వైస్ చైర్మన్ చౌడమల్ల వీరస్వామి, కొత్తగట్టు ఆలయ మాజీ చైర్మన్ తూముల శ్యాంరావు, రవి యాదవ్, కోటిలింగం, రవి, ఆదిత్య, శ్రీనివాస్, క్రాంతి, మహబూబ్ అలీ, తిరుపతి పాల్గొన్నారు.

## డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలి

తెలంగాణచౌక్/ హుజూరాబాద్ టౌన్, జనవరి 24: ఆర్టీసీ డ్రైవర్లు విధి నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలని కరీంనగర్ ఆర్ఎం సుచరిత సూచించారు. డ్రైవర్స్ డేను పురస్కరించుకొని కరీంనగర్ డిపో-2లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చాలని సూచించారు. ఉత్తమ సేవలందించిన డ్రైవర్లకు ఆర్ఎం గులాబీ పూలు అందించి, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు శ్రీనివాస్, నాగలక్ష్మి, డీఎంలు మల్లేశం, మల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు. హుజూరాబాద్ బస్టాండ్ ఆవరణలో డ్రైవర్స్ డే సందర్భంగా నిర్వహించిన సమావేశానికి ఎంవీఐ ఠాకూర్ ఈశ్వర్ సింగ్ హాజరై, డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలను వివరించారు. ఉత్తమ డ్రైవర్లను సత్కరించారు. కార్యక్రమంలో హుజూరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

## వివక్షను బాలికలు ధైర్యంగా ఎదుర్కోవాలి

హుజూరాబాద్‌టౌన్, జనవరి 24: బాలికల విషయంలో ఇంకా కొంత వివక్ష ఉందని, దానిని ధైర్యంగా ఎదుర్కోవాలని హుజూరాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పాలడుగు అలేఖ్య అన్నారు. బుధవారం పట్టణంలోని న్యూ కాకతీయ హైస్కూల్‌లో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు హాజరై మాట్లాడారు. బాలికలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, న్యాయ సేవాధికార సంస్థ సభ్యుడు యతిపతి అరుణ్‌కుమార్, న్యాయవాదులు కాసు ఐలయ్య, వేముల మాధవి, పాఠశాల కరస్పాండెంట్ రాజ్‌కుమార్‌యాదవ్, డైరెక్టర్ గోపాల్, వెంగళరావు పాల్గొన్నారు.

## చీడ పీడల నుంచి వరిని కాపాడుకోవాలి

శంకరపట్నం, జనవరి 24: రైతులు తమ వరి పైర్లను చీడ పీడల బారి నుంచి కాపాడుకోవాలని జమ్మికుంట కేవీకే ప్రధాన శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు సూచించారు. బుధవారం శంకరపట్నం మండలం మొలంగూర్, కన్నాపూర్ గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో పొలాల్లో జింక్ లోపంతో పాటు సల్ఫైడ్ దుష్ప్రభావంతో మొగి పురుగు ఉధృతి పెరుగుతున్నదన్నారు. నివారణకు గాను రైతులకు పలు పద్ధతులను వివరించారు. ఇక్కడ కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి, ఏవో శ్రీనివాస్, మెట్‌పల్లి సింగిల్ విండో చైర్మన్ పల్లె సంజీవరెడ్డి, డైరెక్టర్ బుచ్చిరెడ్డి, రైతులు ఉన్నారు.

## సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

కమాన్‌చౌరస్తా, జనవరి 24: స్వామి వివేకానంద-నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని ప్రజ్ఞాభారతి (కరీంనగర్) ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, రామాయణం, క్విజ్ పోటీల్లో స్థానిక సిద్ధార్థ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ దాసరి శ్రీపాల్ రెడ్డి తెలిపారు. విద్యార్థులు సాన్వి, అచ్యుత్, మనస్విని బుధవారం ఆయన అభినందించారు.

## విద్యార్థులకు అభినందన

కమాన్‌చౌరస్తా, జనవరి 24: బోయవాడలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు క్యాట్ లెవెల్-2 ఫలితాల్లో సత్తా చాటినట్లు ఏజీఎం ఎం రాజు, ప్రిన్సిపాల్ పద్మజ పేర్కొన్నారు. విద్యార్థులను బుధవారం ఏజీఎం, ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు సునీల్ కాంత్, ప్రవీణ్, మహేశ్, సతీశ్, మనోహర్ రెడ్డి, శ్రీకాంత్ అభినందించారు.

### • బ్రదర్.. మిర్చి బాగుంది



తిమ్మాపూర్, జనవరి 24: కరీంనగర్ పర్యటనకు వచ్చిన బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ బుధవారం సాయంత్రం తిరిగి హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి స్టేజీ సమీపంలో కాసేపు ఆగారు. పక్కనే ఉన్న మిర్చిల బండి వద్దకు వెళ్లి నాయకులతో కలిసి మిర్చిలు తిని, చాయ్ తాగారు. స్థానికులు కేటీఆర్‌తో సెల్ఫీలు, ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు. కాగా, వెళ్లే ముందు 'బ్రదర్ మిర్చి బాగుంది' అంటూ మిర్చి బండి యువకున్ని అభినందించారు. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రావుల రమేశ్, మండల, స్థానిక నాయకులు ఉన్నారు.

## కుటుంబ వ్యవస్థలో మార్పుతోనే బాలికల్లో అభివృద్ధి



బాలికలకు కేక్ తినిపిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, జనవరి 24: కుటుంబ వ్యవస్థలో మార్పు వచ్చినప్పుడే బాలికల అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. నగరంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ బాలికా దినోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు కూతురు, కొడుకును సమానంగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. అదేస్థాయిలో తండ్రికి ఇచ్చే గౌరవం తల్లికి కూడా ఇవ్వాలని బాలికలకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీడబ్ల్యూవో ఎం సరస్వతి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, మార్కెటింగ్ శాఖ డీడీ పద్మావతి, సీడీపీవో సబిత, ఐసీపీఎస్ శాంత, డీఈవో జనార్దన్‌రావు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

## పిటిషన్ మేనేజ్‌మెంట్ సక్రమంగా అమలు చేయాలి

రాంనగర్, జనవరి 24: పోలీస్ స్టేషన్లలో పిటిషన్ మేనేజ్‌మెంట్ సక్రమంగా అమలయ్యేలా చూడాలని సీపీ అభిషేక్ మహంతి పోలీస్ అధికారులను ఆదేశించారు. నగరంలోని ఏసీపీ కార్యాలయంలో బుధవారం ఆయన టౌన్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ, టౌన్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగులో ఉన్న కేసుల వివరాలు, పురోగతిని అడిగి తెలుసుకున్నారు. క్రిమినల్ కేసులతోపాటు ఆర్థిక నేరాలు, భూతగాదాలు, భూఆక్రమణలు, రౌడీషీటర్స్‌పై నిఘా, పెండింగ్ వారెంట్ల అమలు, తదితర అంశాలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. సమావేశంలో ఏసీపీలు నరేందర్, విజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు సరిలాల్, వెంకటేశ్, శ్రీనివాస్, శ్రీలత పాల్గొన్నారు.

## గ్రంథాలయ ఏర్పాటుకు భవనం పరిశీలన

తిమ్మాపూర్, జనవరి24: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న భవనంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసేందుకు అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ బుధవారం మండల అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం ఎల్ఎండీ క్వార్టర్స్‌లో ఉన్న గ్రంథాలయాన్ని ఎవరూ వినియోగించుకోకపోవడంతో మరోచోటకు మార్చాలని ఆయన నిర్ణయించారు. మరికొద్ది రోజుల్లో గ్రంథాలయం తహసీల్దార్ కార్యాలయం లేదా, రాజీవ్ రహదారికి దగ్గరగా ఉండే కార్యాలయాల్లో ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఇక్కడ తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

## కర్పూరీ ఠాకూర్‌కు నివాళి

తెలంగాణచౌక్, జనవరి 24: బీహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్ శత జయంతి వేడుకలను నగరంలోని తెలంగాణ నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. కర్పూరీ ఠాకూర్ చిత్రపటానికి సంఘం జిల్లా అధ్యక్షుడు నీలం మొండయ్య ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం సభ్యులు సంపత్, నర్సయ్య, శ్రీనివాస్, జయరాం, రమేశ్ పాల్గొన్నారు. అలాగే, కర్పూరీ ఠాకూర్ చిత్రపటానికి నాయీ బ్రాహ్మణ ఐక్య వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్ పూల మాల వేసి నివాళులర్పించారు.

## 28న హుజూరాబాద్ జిల్లా సాధన సదస్సు

ఇల్లందకుంట/ వీణవంక/ సైదాపూర్/ శంకరపట్నం, జనవరి 24: పీవీ హుజూరాబాద్ జిల్లా సాధన సదస్సును విజయవంతం చేయాలని జిల్లా సాధన జేఏసీ స్టీరింగ్ కమిటీ కన్వీనర్ సదానందం కోరారు. బుధవారం ఇల్లందకుంటలో ఈ నెల 28న హుజూరాబాద్‌లో జరిగే పీవీ జిల్లా సాధన సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇక్కడ జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు తదితరులున్నారు. వీణవంక మండల కేంద్రంలో సదస్సు విజయవంతం కోసం పీవీ హుజూరాబాద్ జిల్లా సాధన జేఏసీ మండల కన్వీనర్ మర్రి స్వామి యాదవ్ సభ్యులతో కలిసి ర్యాలీ తీశారు. సైదాపూర్ మండలకేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద సదస్సు జిల్లా సాధన జేఏసీ నాయకులు కరపత్రాలను విడుదల చేశారు. హుజూరాబాద్ జిల్లా సాధన సదస్సును విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంఘం శంకరపట్నం మండలాధ్యక్షుడు బొంగోని అభిలాష్ కోరారు. శంకరపట్నంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

## హామీలన్నింటినీ అమలు చేస్తాం: మంత్రి శ్రీధర్‌బాబు



చొప్పదండిలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

చొప్పదండి, జనవరి 24: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలతోపాటు మ్యానిఫెస్టోలోని హామీలన్నింటినీ తప్పక అమలు చేస్తామని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పునరుద్ఘాటించారు. బుధవారం ధర్మపురి వెళ్తున్న ఆయనకు చొప్పదండి పట్టణంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. గజమాల వేసి సన్మానించారు. అనంతరం మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ ఉనికే లేదని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ మునిగాల లక్ష్మి-చందు, కౌన్సిలర్లు కొట్టె అశోక్, పెరుమండ్ల మానస- గంగయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు ముద్ద తిరుపతి గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన జడ్పీటీసీ

గంగాధర, జనవరి 24: రాష్ట్ర ఐటీ, శాసన సభ వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును జడ్పీటీసీ పుల్కం అనురాధ-నర్సయ్య బుధవారం చొప్పదండిలో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## మంత్రికి అర్చకుల వినతి

చొప్పదండి, జనవరి 24: ధూప దీప నైవేద్య అర్చకుల కుటుంబాలకు ప్రభుత్వం రూ. ఐదు లక్షల విలువైన ఆరోగ్య బీమా వర్తింపజేయాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు డీడీఎన్ అర్చక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింహాచలం ప్రభాకరాచార్యులు, జిల్లా అధ్యక్షుడు నాగరాజు సంపత్ కుమారాచార్యులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీడీఎన్ జిల్లా సభ్యులు హరిదాసు, హరికృష్ణ, చక్రపాణి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అధ్యాపకుడికి అభినందన

కమాన్‌చౌరస్తా, జనవరి 24: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల ఆంగ్ల అధ్యాపకుడు ఒల్లాల శ్రీనివాస్ విజయవాడలోని ఆంధ్రా లయోలా కళాశాలలో నిర్వహించిన సెమినార్‌కు హాజరయ్యారు. ఇందులో భాగంగా 'జెండర్ ఇష్యూస్ పొట్రెయల్ ఆఫ్ ఉమెన్ క్యారెక్టర్స్ ఇన్ ద వర్క్స్ ఆఫ్ శోభాడే' అంశంపై తన పరిశోధన పత్రం సమర్పించినట్లు తెలిపారు. శ్రీనివాస్‌ను ఆర్ఎల్‌సీ కే సురేశ్, ప్రిన్సిపాల్ చంద్రమోహన్, విజిలెన్స్ అధికారులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

## సహజ వనరులను కాపాడుకోవాలి

కరీంనగర్ రూరల్, జనవరి 24: సహజ వనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. నగరంలోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో తెలంగాణ ఉన్నత విద్యామండలి సౌజన్యంతో పర్యావరణ పరిరక్షణ, పర్యవేక్షణ పద్ధతులపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రొఫెసర్లు శ్రీనివాస్, రాజగోపాల్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ జయంతి డాక్టర్ సుజాత, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సమత, సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎస్ సుష్మ పాల్గొన్నారు.

## బాలల పరిరక్షణ కమిటీ సమావేశం

హుజూరాబాద్‌టౌన్, జనవరి 24: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జిల్లా సంక్షేమ శాఖ సమగ్ర బాలల అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో పట్టణ బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కే విజయ్‌కుమార్ మాట్లాడుతూ, బాలల హక్కుల పరిరక్షణ కోసం అందరూ సహకరించాలన్నారు. ఎంపీడీవో జయశ్రీ, సీడీపీవో భాగ్యలక్ష్మి, ఎస్ఐ సాంబయ్య గౌడ్, ఎంపీవో సురేందర్, ఎంఈవో కేవీ నరసింహారెడ్డి, సూపర్‌వైజర్ తిరుపతమ్మ, బాలల పరిరక్షణ అధికారి రమేశ్, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సూపర్‌వైజర్ కుమారస్వామి, ఆర్ఐ రంజిత్ పాల్గొన్నారు.

## తెలంగాణ చేనేత ఐక్యవేదిక క్యాలెండర్ ఆవిష్కరణ

హుజూరాబాద్‌టౌన్, జనవరి 24: రాష్ట్ర చేనేత ఐక్యవేదిక ప్రచార కార్యదర్శి జడల చిరంజీవి, హుజూరాబాద్ చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం సంఘం కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఇక్కడ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు ఎలిగేటి ఉపేందర్, ఉపాధ్యక్షుడు వేముల యాదగిరి, హుజూరాబాద్ మండలం(రూరల్) పద్మశాలీ సంఘం అధ్యక్షుడు సంగెం సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.